# దినచర్య

విధీ విరామం ఎరగని జానిస, టెలిప్రింటరు టకటకా కొట్టుకుపోతున్నది. "సబ్బు" లందరూ తదేక ధ్యానంతో రాస్తున్నారు. వాళ్ళ ముందర తర్జుమా కావలసిన టెలిగ్రాముల బొత్తులున్నాయి.

కైలాసం విసుక్కుంటూ రాస్తున్నాడు. తన బల్లమీదికి వచ్చిన టెలిగ్రాములన్నీ ఒకసారి చూసుకున్నాడు. ఒక్కటైనా "మంచి టెలిగ్రాం లేదు "మంచి" టెలిగ్రాం అనేదానికి ప్రత్యేకమైన నిర్వచనం లేదు. ఒక్కో రోజు కైలాసం యూరపుదేశాల చెల్లింపు సమస్యల్ని గురించి ఎంతో ఆసక్తితో రాస్తాడు. ఒక్కోనాడు చక్కని కథలాటి టెలిగ్రాం వచ్చినా విసుక్కుంటాడు.

కైలాసం రాసే "మూడ్" లో ఉండేదీ లేనిదీ నిర్ణయించేవి ఏవో ఎవరూ

చెప్పలేరు. అతనిమీద సంఖ్యా జ్యోతిషం పని చేస్తుంది. అనగా తారీఖుల ప్రభావం జాస్తిగా ఉంటుంది. 20 కి పైబడిన తేదీ సంఖ్యలు కైలాసం "మూడ్" కు అనుకూలంగా ఉండవు. ఇంటి దగ్గిర భార్య చేసిపెట్టిన వంటకాల ప్రభావమూ, ఆఫీసుకు వచ్చేటప్పుడు బస్సు స్టాండు దగ్గిర ఎండలో నిలబడే ఘడియల సంఖ్యా ప్రభావమూ కైలాసం మీద బలంగా ఉంటాయి.

టెలిగ్రాములు తిరగేసేటప్పుడే కైలాసం ఒక్కొక్కదానిమీదా ఒక్కొక్క ప్రత్యేక విమర్శ విసిరాడు. ఇండొనేషియాలో అల్లరి. వాళ్ళకు స్వాతంత్ర్యం అరగటం లేదు. అంతే కావాలి (వెధవలకు) .... మలయాలో దౌర్జన్యవాదుల మీద బాంబుల వర్షం. నల్లుల మీద డి డి టి కొట్టినట్టె. అందులో విషం ఉందట. నల్లులు హాయిగా డి డి టి తినేసి మరిన్ని పిల్లల్ని పెడుతున్నాయి. కొంపనిండా నల్లుల పుట్టలు. తెల్లార్లూ నిద్రపోనివ్వవు .... డీన్ ఎచిసన్ చైనాను ఉద్ధరించాడు. ఆసియాను ఉద్ధరిస్తాట్ట! ఈ అమెరికా కమ్యూనిజం నుంచి ఆసియాను ఉద్ధరిస్తుందనుకోవటంకన్న బుద్ధి తక్కువ మరొకటి లేదు. నిజంగా డిడిటి తినే నల్లులకూ ఈ కమ్యూనిస్టులకూ ఏమీ తేడా లేదు....

కైలాసం రాయటం మానేసి తల ఎత్తి చూశాడు. డెమొక్రసీని ఉద్ధరించే సత్యనారాయణా, కమ్యూనిజమును ఉద్ధరించే భగవాన్లూ చర్చ ప్రారంభించారు. అది రోజూ ఉండే చర్చే, భగవాన్లు రష్యా మీద ఈగ వాలనివ్వడు. సత్యనారాయణ రష్యా పేరు చెబితే పంచాంగం విప్పుతాడు.

"అసలు రహస్యం ఒక్కడికీ తెలీదు. రష్యా, అమెరికా కలిసి మిగిలిన దేశాల్ని యుద్ధంలో ముంచటానికి చూస్తున్నారు. అందుకే నెహ్రూ ఎటూ చేరలేదు" అనుకున్నాడు కైలాసం.

ఎవరూ గ్రహించలేని సత్యాలు తెలుసుకుని ఎవ్వరికీ చెప్పకుండా ఉండటంలో గొప్ప ఆనందం ఉంది. ఆ ఆనందం కైలాసానికి రోజూ లభిస్తుంది.

"నువు రష్యా వెళ్ళి చూసి వచ్చావు గామాలు" అన్నాడు సత్యనారాయణ.

"చూస్తేనే తెలియక్కర్లేదు. బుద్ధి ఉంటే అన్నీ తెలుస్తయ్" అన్నాడు భగవాన్లు.

"అవును! నీ ఒక్కడికే పెట్టాడు మరి దేవుడు ప్రపంచంలో ఉన్న బుద్ధంతా" అన్నాడు సత్యనారాయణ.

"పోనివ్వండయ్యా," అన్నాడు శివరావు.

కైలాసం తిరిగి తల వంచుకు రాసుకోబోతుండగా టెలిగ్రాపు బంట్రోతు ఏదో టెలిగ్రాం తెచ్చి కైలాసం ముందు పెట్టాడు.

"అవతల ఆ బల్ల దగ్గిర ఇయ్యి" అన్నాడు కైలాసం. అమెరికా వెళ్ళి లియాఖతాలీఖాన్ పేలే అవాకులూ చవాకులూ రాయటం చాలక టెలిగ్రాములకు సంతకా లెవడు పెడుతూ కూచుంటాడు?"

"సుబ్రహ్మణ్యంగారూ, డిమాండుకు తెలుగేమిటి?" అని అడిగాడు పార్వతీశం.

"ఖైదులో ఉంచటం కాదూ?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఎవరో నవ్వారు.

"డిమాండంటే ఖైదులో ఉంచట మేమిటయ్యా?"

"డిమాండు, అని రాయవయ్యా దేవుడా?" అని ఇంకొకరు అందు కున్నారు.

"ఓహో, డిమాండా? నే నింకా రిమాండేమో అనుకున్నా, నిన్న ఇట్లాగే చిత్రం జరిగింది. నే నేమన్నా నంటే—"

"అబ్బాయ్, 'కోరికా' అని రాసిపారెయ్యి. అంతకన్న మంచి మాట ఏ డిక్షనరీలోనూ దొరకదు" అన్నారు మరొకరు.

"రిక్వెస్టంటే కోరిక గాని డిమాండంటే కోరికేమిటి? దబాయింపు, అని రాయనా?"

"ఏదో రాయదల్చుకున్నవాడివి రాయక అందర్నీ చంపుతా వెందుకూ?"

మళ్ళీ సద్దు మణిగింది. కైలాసం లియాఖతాలీ "అభిభాషణ" దగ్గరికి తిరిగివచ్చాడు. ఇస్లామంటే డెమోక్రసీయే నంటున్నాడు లియాఖతాలీ.

"ఈ ఫ్రెంచి పేర్లు ఎట్లా రాయాలో మనకు తెలియదే. ఏమండీ, దీక్షితులు గారూ, పి-ఐ-జి-ఎన్-ఓ-ఎన్ ఏమనాలి?"

"పాన్యూ అనాలి."

"నే చచ్చినా అన్నూ."

"పిగ్నాన్ అని రాయండి."

"ఆ మాటన్నారు బాగుంది."

"ఈ దీక్షితులుగా రొకడు పొగైనాడు మా ప్రాణానికి," అనుకున్నాడు కైలాసం, "సోయెకర్నొ అనకూడదట! సుకర్నొ అనాలిట! సుదర్శనో, సుమిత్రో అనాలిట! సోయెకర్నో అని రాస్తే అచ్చు పడదు కామాలు, అన్నీ వేషాలు!"

లియాఖతాలీ "అభిభాషణ అయేసరికే పుణ్యకాలం వెళ్ళేట్టుంది. ఇంకా ఎచిసిన్ ఉద్ఘాటనా, మలయాలో కమ్యూనిస్టుల కిరాతక కృత్యాలూ, అదేదో రైలు ప్రమాదమూ అట్లానే వున్నాయి.

కైలాసంగారూ, లియాకతాలీని నమ్మకైజు చెయ్యటంలా? కొద్దిలో ముగించక పోయినారా?"

కైలాసానికి చాలా దుఃఖం వచ్చింది. కొద్దిలో ముగించాలని తెలిస్తే కైలాసం ఎప్పుడో పూర్తి చేసి ఉండును.

"టెలిప్రింటరు అరగంట నుంచీ కొట్టటం లేదు. ఏం జరిగిందో కాస్త కనుక్కుంటారా ఏమిటి?"

కైలాసం ఎగిరి గంతేసి లేచి టెలిఫోను దగ్గిరికి వెళ్ళాడు.

"ఏమండీ? మెషీన్ ఆడటంలేదా? ఫైవ్ మినిట్స్ కింద కూడా క్రీడ్ చేస్తూ ఉన్నామే? .... మా మెకానిక్‌తో కాపీలు పంపుతాం లెండి" అన్నది రిసీవర్.

"సెమీ అఫిషియల్ అంటే ఏం రాయాలి?"

"అర్ధ ప్రభుత్వమా? వ్యర్థ ప్రభుత్వమా?"

"అయితే నాకు తెలీదు."

"నీకే కాదు, మహామహా వాళ్ళకు తెలీదు."

"అది సరే గాని ఎక్స్చేంజంటే ఏమిటోయ్?"

"మారకం."

"ఎవరి మారకం?"

"మారకం కాదు లేవయ్యా, వినిమయమని రాయి."

"వినిమయమంటే ఖర్చు చెయ్యటం కాదుటండీ?"

"అది వినియోగం."

"వినిమయ మేమిటి? వినియోగ మేమిటి? రెండూ ఒకటే."

"కాదులే, ఊరుకో."

"వినిమయమంటే మారకం వేసుకోవటమేలే. ఖర్చు చెయ్యటం కాదు."

"ఖర్చు చెయ్యటానికి వినిమయమని రాస్తున్నానే?"

"ఇక ఎప్పుడూ రాయబోక!"

టెలిఫోను మోగింది.

కైలాసం లియాఖతాలీని తప్పించుకోవటానికి లేచి టెలిఫోను దగ్గిరికివెళ్ళి రిసీవరెత్తాడు. రాయిటర్సు ఆఫీసువాళ్ళు.

"మెషీన్ పని చేస్తున్నదా?"

"లేదే?"

"లైన్ ట్రబులేమో కనుక్కుంటాం. మెకానిక్ వచ్చాడా?"

"రాలేదు."

"కాఫీలు తెద్చాడా?"

"మెకానిక్ రాలేదు" అని అరిచాడు కైలాసం.

"అట్లా చెప్పరాదా? ఎందుకు కోపం చేసుకొంటారు?" అని మందలించింది రిసీవరు.

"కైలాసంగారూ, రైలు ప్రమాదంమీద స్టేట్మెంటు వచ్చింది. మిగిలినవి మానేసి అది కాస్త రాయండి. ఇదిగో స్టేట్మెంటు."

మళ్ళీ సంభాషణ ఆరంభమయింది.

"ఈ విధంగా రైళ్ళు పడగొట్టే, కమ్యూనిస్టులు ఉన్న కాస్త మర్యాదా పోగొట్టుకున్నారు."

"ఇది కమ్యూనిస్టుల పనే! హారి వీళ్ళ కడుపుడకా! .... ఇంకా మీకేమన్నా సందేహమా ఏమిటి?"

"ఎంతమందిని పొట్టన పెట్టుకున్నారో."

"ఇదే విప్లవం!"

ఇటువంటి పనులు చేసినా కమ్యూనిస్టులను వెనకేసుకొచ్చే వాళ్ళున్నారు. అందుకనుకోవాలి."

"భగవాన్లూ! చూశావా ఎట్లా అంటున్నారో? చూస్తావేం?"

"నన్నేం చెయ్యమన్నావు?"

"కమ్యూనిస్టులు రైళ్ళు పడగొడుతున్నారట."

"పడగొట్టనీ. విచారణ జరిపి శిక్షించేవాళ్ళు లేరూ?"

"అట్లా జారిపోతావేం?"

"జారేందు కేముందీ? కొందరికి చూడకుండానే వార్తలు తెలుస్తాయి. దాని కెవరేం చేస్తారు?"

"రైళ్ళు పడగొట్టే వాళ్ళింకెవరూ లేరని మాకు అపాటి తెలుసులే. కాస్త మాకూ ఆ మాత్రం ఊహించే శక్తి ఉంది. దాం దుంపతెగ ఎంత ఇదయినా!" అన్నాడు సత్యనారాయణ.

"ఆ శక్తి ఎవరుమటుకు వారు తమ కుండటం అర్థం చేసుకోగలరు గాని ఇంకొకరి కుండటం అర్థం చేసుకోలేరు. అక్కడే చిక్కొచ్చేది" అన్నాడు భగవాన్లు.

"అయితే కమ్యూనిస్టులు రైళ్ళు పడగొట్టటం లేదంటావు?"

"నే నేమీ అనలేదు. ఎవరు పడగొడుతున్నదీ ఎప్పటికైనా తెలియదా అంటాను."

ఆ వాదన అంతటితో ఆగిపోయింది.

కైలాసానికి క్షణ క్షణానికి విసుగు జాస్తీ అవుతున్నది. అతను అయిదు నిమిషాల లోపల రెండుసార్లు గడియారంకేసి చూసి, "ఈ మధ్య అయిదు నిమిషాలేనా అయింది? లేక గడియారం ఆగిపోయిందా!" అని ఆశ్చర్యపడ్డాడు.

మెకానిక్ వచ్చాడు, కాపీలతో.

"ఎటువంటి సమయంలో మెషీను చెడిపోయిందో! .... కైలాసంగారూ, మిగిలినవన్నీ ఆపేసి నెహ్రూ సీరీస్ తీసుకోండి."

"నెహ్రూ ఉపన్యాసమా?"

"అవును. ఇవాళ అదే స్ట్రీమరు.

అంతవరకూ సగం చచ్చినట్టున్న కైలాసం ఒంట్లోకి ఎక్కడలేని శక్తి వచ్చింది.

నెహ్రూ ఉపన్యాసం అయిదు భాగాలు చేతికొచ్చాయి. కైలాసం వాటిని ముందేసుకుని ఏకధాటిగా రాయటం మొదలుపెట్టాడు. చుట్టు పక్కల ఏం జరుగుతున్నదీ కైలాసానికి తెలీదు. మెషీను ఎప్పుడు బాగయిందీ తెలీదు. నెహ్రూ సీరీస్ మరి మూడు భాగాల కాపీలు ఎప్పుడు ఎవరు తెచ్చారో తెలీదు. నెహ్రూ తొమ్మిదో భాగం నుంచీ మెషీను మీది కాగితాలే వచ్చాయి. రెండు గంటలలోపుగా మూడు కాలముల తర్జుమా లాగి అవతల పారేశాడు కైలాసం.

*　　　　*　　　　*

"ఏమేవ్? పేపరు చూశావా? ఇవాళ స్ట్రీమర్ హెడ్ లైను మనదే! ఎట్లా రాశాననుకున్నావు? శరపరంపరేననుకో," అన్నాడు కైలాసం మహోల్లాసంతో.

"ఏం స్టీమరో? ఈ పూట కూరే దొరకలేదు. పొద్దున కూడా పాపం, మీకు తిండి సరిగా అమరలేదు. ఈ పూటేం తింటారో నా కర్థంకాలా!" అన్నది భార్య.

"ఏ కంది పచ్చడో చేసి, ఇంత చారు పెట్టవే. అంతకంటె ఏం కావాలి?" అన్నాడు కైలాసం, ఎంత అణచినా అణగని ఉత్సాహంతో.

[ప్రథమ ముద్రణ : జూలై 1950, ఆంధ్రజ్యోతి, మాసపత్రిక]

**